క్లుప్తంగా

ప్రొసీడింగ్ అందజేత

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని అమడ బాకుల కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు పాఠశాల సిబ్బంది గతంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశాల ద్వారా స్థానిక జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ రూ.3లక్షలు మంజూరు చేశారు. నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని మంగళవారం పాఠశాల సిబ్బందికి జెడ్పీ వైస్ చైర్మన్ అందజేశారు.

ఆరె కటికల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల: ఆర్థికంగా వెనకబడ్డ ఆరె కటిక కులస్తుల సమస్యలు పరిష్కరించాలని మండల ఆరె కటిక సంఘం నాయకులు శివాజీ, శంకర్‌జీ, బాలాజీ, వెంకట్‌రావు, శ్రీనివాసులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ కులవృత్తులకు ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సాయం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఆరె కటిక కులస్తుడికి అందించాలని కోరారు. ఆరెకటికల సమస్యల పరిష్కారం కోసం బుధవారం మండల కేంద్రంలో ఆరె కటిక కులస్తుల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయానికి విరాళం

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని కానాయపల్లి సమీపంలోని శ్రీదత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కోటిలింగాల ప్రతిష్ఠ, ధ్యాన కేంద్రం, పంచలోహ లింగం ఏర్పాటుకు వనపర్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న విష్ణుమూర్తి, కృష్ణవేణి దంపతులు రూ.27,116 విరాళం ఆలయ నిర్వాహకులు శేఖరయ్యకు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న పుణ్య కార్యక్రమాలకు దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేయాలని నిర్వాహకులు కోరారు.

పౌష్టికాహారం పంపిణీ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని నాలుగోవ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, ఎమ్మార్సీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరమ్మలు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుగుణాభాయి, మహేశ్వరి, అంగన్‌వాడీ హెల్పర్లు లచ్చమ్మ, ఈశ్వరమ్మ, పలువురు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

వనపర్తి: కాలేజీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయల్దేరిన యువతి అదృశ్యమైన ఘటన మంగళవారం చెన్నారంలో చోటుచేసుకుంది. టౌన్ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. రేవల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన సమత ఇంటర్ పూర్తి చేసింది. టీసీ తెచ్చుకుంటానని జూలై 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి మధు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ తెలిపారు.

ఘర్షణలో మహిళకు గాయాలు

వనపర్తి: ఘర్షణలో మహిళకు గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని ప్యాటగడ్డలో మంగళవారం చోటుచేసుకుంది. టౌన్ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ప్యాటగడ్డకు చెందిన ఎన్ లలిత తమ సమీప బంధువు వరుసకు అక్క చెన్నమ్మ, ఆమె భర్త కృష్ణయ్యల మధ్య చిన్నపాటి ఘర్షణ మొదలైంది. తోపులాటలో లలిత తలకు గాయాలు కావడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ తెలిపారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

పాన్‌గల్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తైబజార్ వేలం

చిన్నంబావి: చిన్నంబావి మండలం, గ్రామం ఏర్పాటైన నేపథ్యంలో అభివృద్ధే లక్ష్యంగా ప్రతి గురువారం కూరగాయల సంత ఏర్పాటుకు తైబజార్ వేలం బుధవారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రంజిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.10వేలు చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. దక్కించుకున్న వారు వేలం పాట ప్రకారం మూడో వంతు వెంటనే చెల్లించాలని సూచించారు. వేలం పాట దక్కించుకున్నవారు తైబజారు ఒక సంవత్సరం ఉంటుందని, ఆసక్తి గల వారు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సర్వసభ్య సమావేశం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అజాగ్రత్తగా ఉంటే అనారోగ్యమే!

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- దోమల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు
- పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


కొత్తకోట పట్టణంలో పేరుకున్న మురుగు

కొత్తకోట రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం అజాగ్రత్త వహించినా అనారోగ్యం పాలు కాకతప్పదు. నీటి కాలుష్యం వల్ల జలుబు, దగ్గు, వాంతులు, నీళ్ల విరేచనాలు వంటి రోగాలు వ్యాపిస్తాయి. దోమ కాటు వల్ల టైఫాయిడ్, డెంగీ, మలేరియా, మెదడువాపు, చికెన్‌గున్యా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. వర్షాకాలంలో చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు ఇబ్బందులకు గురవుతారు. వ్యాధుల బారిన పడి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల ముందు ప్రజలు క్యూ కడుతున్నారు. జ్వరం, గొంతునొప్పి, వాంతులు తదితర సమస్యలే అధికంగా ఉన్నాయి. వాతావరణంలోని మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈగలు, దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దోమకాటు వల్ల డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు రావడం వల్ల రోగుల సంఖ్య పెరుగుతోంది. వర్షాకాలంలో కలరా, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంటుంది.

దోమకాటుతో విష జ్వరాలు..

వర్షాకాలంలో దోమల బెడద తీవ్రంగా ఉంటుంది. ముసురు వానలకు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతాయి. ఖాళీ ప్రదేశాల్లో, మురికిగుంతల్లో, డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమల ఉత్పత్తి పెరుగుతుంది. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలి.

టైఫాయిడ్ లక్షణాలు..

ఎక్కువ రోజుల పాటు జ్వరం, నీళ్ల విరేచనాలు లేదా చీముబంక విరోచనాలు, శరీరంలో ఉండే నీటి శాతం తగ్గి డి హైడ్రేషన్ వస్తుంది. ఇలా ఉంటే టైఫాయిడ్‌గా గుర్తించాలి.

కలరా లక్షణాలు..

నీళ్ల విరేచనాలు, వాంతులు కావడం తద్వారా శరీరంలో నీటి శాతం తగ్గి డీ డైడ్రేషన్ రావడం జరుగుతుంది.

పచ్చకామెర్లు..

కలేయానికి వాపు రావడం, కళ్లు పసుపు పచ్చగా మారడం, ఆకలి లేకపోవడం, నీరసంగా ఉండటం పచ్చ కామెర్ల వ్యాధిగా గుర్తించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కాచి చల్లార్చి వడపోసిన మంచినీటిని తాగాలి
- వాంతులు, విరోచనాలు(కలరా)తో బాధపడుతున్న వ్యక్తికి గ్లాస్ నీటిలో ఒక స్పూన్ చక్కెర, చిటికెడు ఉప్పు కలిపిన ద్రావణం లేదా ఓఆర్‌ఎస్ ద్రావణం తరచుగా తాగించాలి.
- కలరా, టైఫాయిడ్, పచ్చకామెర్ల వ్యాధులతో బాధపడే రోగులను విడివిడిగా ఉంచాలి.
- రోగులకు సంబంధించిన గ్లాసులు, ప్లేట్లు విడిగా ఉండేలా చూసుకోవాలి.
- చిన్న పిల్లలకు బాత్‌రూం కడిగిన తల్లులు తమ చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- ఇంటి పరిసరాలతో పాటు ఇంటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి
- నివాసాల సమీపంలోని మురుగు గుంతలను పూడ్చేయాలి. ఇంటిలో ఫినాయిలతో ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- వర్షాకాలంలో బయటి ఆహార పదార్థాలను తీసుకోకూడదు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం..



వర్షాకాలంలో పరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులను దూరం చేయొచ్చు. నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. నిత్యం వేడి పదార్థాలను తినాలి.

– డాక్టర్ శ్రీనివాసులు, అప్పరాల పీహెచ్‌సీ

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

- ఎంపీడీఓ అఫ్జల్


చీకురుచెట్టు తండాలో మొక్కలు నాటుతున్న తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ అఫ్జల్

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పెద్దమందడి ఎంపీడీఓ అఫ్జల్ అన్నారు. మండల పరిధిలోని చీకురుచెట్టు తండాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటి ముందు పండ్ల మొక్కలు, పూల మొక్కలు నాటాలన్నారు. మండలంలో 1.76లక్షల మొక్కలు నాటే లక్ష్యం ఉందని, 87వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. సీజన్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండేందుకు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా గ్రామస్తులకు సూచించాలన్నారు.

ఆలయంలో చోరీ

మదనాపురం: మండల పరిధిలోని ఎర్రగట్టు మైశమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి అందులోని రూ.1500 నగదును తీసుకెళ్లారు. ఆలయం పక్కన రామన్‌పాడుకు చెందిన లక్ష్మి ఏర్పాటు కిరాణంషాపు రేకులను బద్దలుగొట్టి అందులో రూ.2వేల నగదును దొంగలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి ఎస్‌ఐ మురళి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


అంగన్‌వాడీ టీచర్‌కు పసిపిల్లల ఆరోగ్యంపై సూచనలిస్తున్న ఎంపీడీఓ కతలప్ప

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న పసిపిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, బరువు తక్కువున్న వారిని గుర్తించాలని ఎంపీడీవో కతలప్ప తెలిపారు. మంగళవారం సంగినేనిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ మాలాలితో కలిసి పరిశీలించారు. ముసురు వర్షాల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పసిపిల్లల పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బద్రీనాథ్, అంగన్‌వాడీ టీచర్ కృష్ణమ్మ పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్‌పై శిక్షణ

పాన్‌గల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఎఫ్‌ఎల్‌ఎన్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి)పై వారం రోజులు పాటు శిక్షణ ఉంటుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలోతెలిపారు. తెలుగు, గణితం, ఇంగ్లీష్‌పై మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందని, ఒక్కొక్క సబ్జెక్టుపై రెండు రోజుల చొప్పున శిక్షణ ఇస్తారని, బహుళ తరగతి బోధన చేసే ఉపాధ్యాయులు మాత్రం ఏవైన రెండు సబ్జెక్టుల శిక్షణకు హాజరుకావాలని తెలిపారు. శిక్షణ పేరుతో పాఠశాలలు మూసివేయకుండా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రణాళికలు చేసుకొని శిక్షణకు ఉపాధ్యాయులు హాజరయ్యేలా చూసుకోవాలని పేర్కొన్నారు.

కళ్ల కలకపై అప్రమత్తత అవసరం


విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న మండల వైద్యాధికారి వంశీకృష్ణ

వీపనగండ్ల: కళ్ల కలకపై నిర్లక్ష్యం చేయక అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బాలికలకు కంటి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 10 మంది విద్యార్థులకు పాక్షికంగా కళ్ల కలక వ్యాధి సోకడంతో వారికి మందులు అందజేశారు. నిర్లక్ష్యం చేయకుండా మందులు వాడుతూ కళ్లను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. పాఠశాలలో విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు పాఠశాల ఇన్‌చార్జ్ ఎస్‌ఓ రాధ, పలువురు ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

పెబ్బేరు: ఉమ్మడి పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లోని గ్రామాల్లో పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పంపిణీ చేయనున్నట్లు మంగళవారం పశువైద్య డాక్టర్ మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు ఉమ్మడి పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో అన్ని గ్రామాల్లో పశువులకు, ఎద్దులు, గేదేలకు గాలికుంటు వ్యాధినిరోధక టీకాలు పంపిణీ, నట్టల నివారణ, తెల్ల పశువులలో ముద్ద చర్మ వ్యాధి వ్యాక్సినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఇంటికీ ఆరు పండ్ల మొక్కలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: హరితహారంలో భాగంగా ప్రతి ఇంటికీ 6 పండ్ల మొక్కల పంపిణీ చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి పండ్ల మొక్కల పంపిణీతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల మధ్యలో ఖాళీ స్థలం ఉంటే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటించాలన్నారు. గతేడాది చేపట్టిన ఉపాధి పనులను తనిఖీ చేయుటకు సోషల్ ఆడిట్ బృందం ఈనెల 15 నుంచి గ్రామాలకు వస్తారని తెలిపారు. ఈ సమయంలో పనులకు సంబంధించిన పూర్తి రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌బీఎం రమేష్, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు.

కళాకారుడికి కన్నీటి వీడ్కోలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన కళాకారుడు కురుమయ్య మంగళవారం గుండెపోటుతో మృతిచెందడంతో బుధవారం అంతిమ వీడ్కోలు పలికారు. కురుమయ్య నిరుపేద కుటుంబంలో పుట్టి తన రచనలు, పాటలతో సామాజిక ఉద్యమాలను ముందుకు నడిపిన ప్రజా గాయకుడిగా ఉమ్మడి రాష్ట్రంలో గుర్తింపు తెచ్చుకున్నట్లు పేర్కొన్నారు. అతను ఘణపురంలో మండలంలో ఐకేపీ సీసీగా ఉద్యోగం చేస్తున్నారు. జంగిరెడ్డి తోటి కళాకారులతో కలిసి నాగరాలలో కురుమయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్‌పీ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, తోటి ఉద్యోగులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

విద్యార్థునులకు పుస్తకాల పంపిణీ

కొత్తకోట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు జేఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు కథలు, రంగురంగుల బొమ్మల పుస్తకాలు, దేశ నాయకుల జీవిత చరిత్ర, జంతువులు, పక్షులు, నీతి కథల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. స్కూల్ నుంచి ఇంటికెళ్లిన తర్వాత మొబైల్ ఫోన్స్, టీవీలు చూడడం కాకుండా పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలన్నారు.

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, సర్పంచ్ నంది కౌసల్య, ఎంపీటీసీ తగరం లక్ష్మిలు మంగళవారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన అమలు చేస్తున్నారని, దానికి అనుగుణంగా ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో చిన్నారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు

పెబ్బేరు రూరల్: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జీ సుదర్శన్ అన్నారు. మంగళవారం వనపర్తి మండలంలోని అప్పాయిపల్లి, గుంత తండా, కీర్యతండాలో కంపోస్టు షెడ్ నిర్మాణం, ఉపాధి పనులు, శానిటేషన్, పల్లె పకృతివనం, పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నిర్మాణం చేస్తున్న పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.

ఘనంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు


సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెబ్బేరు: పట్టణంలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో మంగళవారం అధిక శ్రావణ మాసం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి పారాయణం, పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా సమితి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రాజశేఖర్, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన నాయకులు

పెబ్బేరు: హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ దగ్గర రాష్ట్ర విద్యుత్ మీటర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నాకు మంగళవారం పెబ్బేరు నుంచి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 20 ఏళ్లుగా విద్యుత్ సంస్థ నమ్ముకొని పనిచేస్తున్నా, యజమాన్యానికి ఎలాంటి సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండడంతో మహాధర్నాకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ధూపం దశరథం, గోవిందు, మహేష్, మధు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీతో ప్రక్షాళన

- డీఆర్‌డీఓ నరసింహులు


సోషల్ ఆడిట్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నరసింహులు

అమరచింత: ప్రతి ఏడాది గ్రామాల్లో నిర్వహించే ఉపాధి పనుల్లో పురోగతి, అవినీతిని తెలుసుకునేందుకు ప్రభుత్వం మండలాల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించి చర్యలు తీసుకోవడంతో ప్రక్షాళన అవుతుందని డీఆర్‌డీఓ నరసింహులు అన్నారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ సమావేశంలో ఆయన పలు అంశాల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామాల్లో రూ.3.74 కోట్ల పనులు నిర్వహించినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో మేట్లు మాస్టర్లలో చేసిన పొరపాట్లకి రూ.1910 రికవరీ చేయాలని సూచించారు. గ్రామాల్లో నాటిన మొక్కలు 85 శాతం మాత్రమే బతికున్నాయని తెలిపారు. వంద రోజుల పనిదినాలను కూలీలకు కల్పించి, వారికి సకాలంలో డబ్బు చేతికి అందించడంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు ముందుండాలన్నారు. కూలీలకు పనులు కల్పించే బాధ్యత సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. గ్రామాల్లో డిమాండ్ ప్రకారం గుర్తించిన పనులను చేపట్టాలని, వాటికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, జిల్లా అంబుడ్స్‌మెన్ సత్యనారాయణ రెడ్డి, ఏపీఓ బాలయ్య, సోషల్ ఆడిట్ ఎపీసీ అంజాగౌడ్, ఎస్‌ఆర్‌పీలు శ్రీను, స్వామి, ఈసీ రఘు, టీఏలు, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పిన్నంచర్లను సందర్శించిన అదనపు కలెక్టర్


రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావ్

ఆత్మకూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణలో భాగంగా మంగళవారం అదనపు కలెక్టర్ తిరుపతిరావ్ మండలంలోని పిన్నంచర్లను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో బడ్జెట్ సమావేశాలు, పారుశుద్ధ్యం, హరితహారం, డంపింగ్‌యార్డు, తడిచెత్త, పొడిచెత్త ద్వారా ఎరువుల తయారీ, నర్సరీ, కార్యాలయంలోని రికార్డులు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కార్యదర్శుల పనితీరు ప్రదర్శన, సూచికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ అనీల్ కుమార్, డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగ్‌రావ్, కార్యదర్శులు ఉన్నారు.

అభివృద్ధి, అవినీతిపై చర్చిద్దాం

- కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: తన హయాంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని, అవినీతిని కలిపి చర్చించేందుకు తాను సిద్ధమని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి ప్రకటించారు. తేదీ, స్థలం, సమయం ప్రకటిస్తే చర్చకు వస్తానని సవాల్ విసిరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టు నుంచి ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ పాలసీలో భాగంగా రెండు కాలేజీలు వచ్చినంత మాత్రాన గొప్పవాళ్లు అనుకోవద్దని హితవుపలికారు. కొత్తపేటలో గతంలో మీకు ఎంత భూమి ఉండే, ఇప్పుడెంత భూమి ఉంది, పెద్దమునగల్ చేడు, వెల్టూర్, బుద్దారంలో, నది భూగర్భంలోనూ, దేవాలయ భూమిని సైతం కొల్లగొడుతున్నారని, ఇసుకను, ఎర్రమట్టిని, నల్లమట్టిని ఏ ప్రభుత్వ భూమిని వదలడం లేదన్నారు. పీర్లగుట్ట పవిత్రతను నాశనం చేశారని నిప్పులు చెరిగారు. వనపర్తిలో మీ అవినీతిపై సమగ్ర విచారణ చేయిస్తే జైలు శిక్ష తప్పదన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, మైనార్టీ రాష్ట్ర నాయకులు ఖమ్మర్ మియా, కౌన్సిలర్లు ఉన్నారు.

వినూత్నంగా కార్మికుల నిరసన


పాన్‌గల్‌లో గాడిదకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పాన్‌గల్: మండల కేంద్రంలో జేఏసీ పిలుపులో భాగంగా పంచాయతీ కార్మికులు మంగళవారం 27వ రోజు గాడిదకు వినతిపత్రం అందజేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ రాము మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని, జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుగ్రీవుడు, స్వామి, సుబ్బయ్య, శివరాజు, అర్జునయ్య, కురుమూర్తి, సాయిలు, పరుశరాములు, శాంతయ్య, నాగమణి, శేషమ్మ, కృష్ణమ్మ, నాగమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ల డిమాండ్లు పరిష్కరించాలి


రాజీవ్‌చౌక్‌లో నిరసన తెలుపుతున్న స్వీపర్లు

పెబ్బేరు రూరల్: స్వీపర్ల డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింప జేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే మోష కోరారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలో రిలేదీక్షలు చేస్తున్న స్వీపర్లకు ఆయన మద్దతు ప్రకటించారు. దీక్ష శిబిరం నుంచి పట్టణంలో జెండాలు, చీపుర్లతో రాజీవ్‌చౌరస్తా వరకు వినూత్న ప్రదర్శన నిర్వహించారు. కనీస వేతనం రూ. 27 వేలు, ఉద్యోగ భద్రత, చనిపోయిన వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మోష మాట్లాడుతూ స్వీపర్లు 37 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం చర్చలకు పిలవక పోవడం దారుణమన్నారు. అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శోభారాణి, కార్యదర్శి ఖాజాపాషా, ఖయ్యూం, రషీద్, చంద్రమ్మ, సాయమ్మ, బాలస్వామి పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న రాజు

పెబ్బేరు రూరల్: తుఫాన్ బాధితులకు అంచనాలతో సంబంధం లేకుండా కేంద్రం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ రాజు కోరారు. మంగళవారం వనపర్తి జిల్లా సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో 7, 8 జిల్లాల్లో వర్షాలు అధికంగా పడడంతో వరి, పత్తి, మొక్కజొన్న, సోయ పంటలు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను, వరద బాధితులను ఆర్థికంగా ఆదుకోవాల ని డిమాండ్ చేశారు. పంట నష్టం కింద ఎకరాకు రూ.20వేలు, వాణిజ్య పంటలకు రూ.40వేలు, చనిపోయిన వారికి రూ.25లక్షల చొప్పున పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పరమేశ్వరాచారి, ఎం కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే


ఆర్థిక సాయం అందిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

అమరచింత: పేదలకు ఇళ్లు మంజూరు చేసి వారిని ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ కోరు కమిటీ మెంబర్ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వర్షాలకు కూలిన ఇళ్ల బాధితులను ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు బాధితుడు చాకలి సాయిబాబకు ఆర్థిక సాయం అందజేశారు. డబుల్ బెడ్రూం పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగిల్ బెడ్రూం కూడా ఇవ్వలేదని విమర్శించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రజలంతా కాంగ్రెస్ వైపు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహంకాళి విష్ణు, జుబేర్ అహ్మద్, విష్ణువర్ధన్ యాదవ్, మన్నాన్, అయూబ్ పాల్గొన్నారు.

‘నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం’

అమరచింత: నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, తగిన బుద్ధి చెప్పడానికే ఏబీవీపీ ఆధ్వర్యంలో కదనభేరీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా నాయకుడు వినోద్, మండల కన్వీనర్ అఖిల్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించే కదనభేరీ కార్యక్రమానికి విద్యార్థి సంఘం నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతూ వారి ఆత్మహత్యలకు కారణమైన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు ఆందోళన చేస్తామని తెలిపారు.